నిరుపయోగం

- విమ్స్‌లో మూతపడిన మరుగుదొడ్లు
- అధికారుల నిర్లక్ష్యంతో కానరాని మరమ్మతులు
- ఇబ్బంది పడుతున్న రోగులు, వారి సహాయకులు



విమ్స్ ఓపీ వద్ద తాళం వేసి ఉన్న మరుగుదొడ్ల గది

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో మరుగుదొడ్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ఇవి ఉన్నా.. వినియోగానికి పనికి రానివిగా మిగిలాయి. ఇక్కడ మరుగుదొడ్ల లోపలి గచ్చులు, గోడలు, పైపులు శిథిలమయ్యాయి. వాటికి అమర్చిన తలుపులు కూడా విరిగిపోయి పనిచేయడం లేదు. దీంతో విమ్స్‌లో మరుగుదొడ్ల తలుపులను పూర్తిగా మూసేశారు. కొన్ని తలుపులకు తాళాలు వేయగా.. మరికొన్నింటి తలుపుల గొళ్లానికి తాళ్లుకట్టి వదిలేశారు. దీంతో అవి మూతపడ్డాయి. రోగులు, వారిని తీసుకెళ్లే బంధువుల అవసరం కోసం వీటిని ఉపయోగించుకోలేక పోతున్నారు.

వినియోగంలోకి తీసుకురండి..

విమ్స్‌లో వైద్య సేవలు విస్తరించడంతో రోజుకు 650 నుంచి 700 మందికి పైగా రోగులతో ఓపీ నమోదవుతోంది. వారి బంధువులు, సహాయకులతో రోజూ ఓపీ, ఇన్‌పేషెంట్ల విభాగాలు నిండిపోతున్నాయి. వారంతా అత్యవసరంగా మలమూత్ర విసర్జనకు మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో బయటకు పరుగులు తీస్తున్నారు. విమ్స్ ఆవరణలో మొక్కల చాటుకు కొందరు వెళ్లి హమ్మయ్యా అంటూ ఉపశమనం పొందుతున్నారు.


ఫస్ట్ ఫ్లోర్‌లో మరుగుదొడ్ల గది గొళ్లానికి కట్టిన తాడు

అత్యవసరాలైన ఇలాంటి సౌకర్యాలపై అధికారులు నిర్లక్ష్యం వహించడంపై రోగులు, వారి బంధువులు విమర్శలు గుప్పిస్తున్నారు. విమ్స్‌లో మరమ్మతులకు గురైన మరుగుదొడ్లను బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒకరోజు ప్రజా రవాణాను వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీకి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ తన బంగ్లా నుంచి బ్యాటరీ వాహనంలో జీవీఎంసీకి వచ్చారు. అనంతరం వారిద్దరు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగించే నిర్ణయం మేరకు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు.

పరిశుభ్రమైన పరిసరాలతోనే దోమల నివారణ


దోమల వల్ల కలిగే నష్టాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: పరిశుభ్రమైన పరిసరాలతోనే దోమల నివారణ సాధ్యమవుతుందని గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ కళాశాలలో సోమవారం దోమల కారణంగా వచ్చే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ చిన్నదే అయినా.. అది కుట్టడం ద్వారా అనేక వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు వంటి ప్రాణాంతక వ్యాధులు సైతం అందులో ఉన్నాయన్నారు. ఇంటి పరిసరాలు, కళాశాల, ఇతరత్రా పరిసరాల్లో దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మురుగు నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు ఎక్కువగా పెరుగుతాయని, పరిసరాల్లో మురుగు నీరు, చెత్తాచెదారం ఉండకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఇంట్లో తల్లిదండ్రులకు సైతం విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం దోమల వల్ల కలిగే నష్టాలకు సంబంధించిన ప్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్, ఎస్ఎస్ఎస్ పీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏయూ వీసీకి సత్కారం


వీసీ శశిభూషణ్‌ను సత్కరిస్తున్న సెయింట్ లూక్స్ గ్రూప్ ప్రతినిధులు

ఆరిలోవ: ఆంధ్రా యూనివర్సిటీ నూతన వీసీ ప్రొఫెసర్ శశిభూషణ్‌ను సోమవారం నగరంలో సెయింట్ లూక్స్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. సెయింట్ లూక్స్ డైరెక్టర్లు ప్రీతం లూక్, ఆశీర్వాద్ లూక్, పీటర్సన్ లూక్ వీసీని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్‌లో అమలు చేస్తున్న కీలక కోర్సులు, విద్యార్థుల ప్రగతికి సంబంధించిన పలు అంశాలను వీసీకి వివరించారు. ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ఆరిలోవ: ఆరిలోవ కాలనీలోని కమ్మల పాకల్లో నివసిస్తున్న పేదలకు సోమవారం ఆరిలోవకు చెందిన ఆర్ఎంపీ డాక్టర్ సాయికుమార్ అన్నదానం చేశారు. అక్కడ నివాసుల్లో అనారోగ్యంతో ఉన్న వారికి ఉచిత వైద్య సేవలు అందించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం వారికి భోజనాలు వడ్డించారు. దీంతో డాక్టర్ సాయికుమార్‌కు అక్కడి నివాసులు కృతజ్ఞతలు తలిపారు.

మత్స్యకార పాఠశాలలో 'శిక్షా సప్తాహ్'


విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న హెచ్ఎం సత్యవేణి, భాస్కరరావు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 19వ వార్డు వాసవాని పాలెంలోని ప్రభుత్వ మత్స్యకార పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సత్యవేణి, స్మార్ట్‌సిటీ కన్స్యూమర్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ కార్యదర్శి పేర్ల భాస్కరరావు తదితరులు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వివిధ రకాల వంటకాలతో పాటు విద్యార్థులకు అరటి పండ్లు, మిఠాయిలతో కూడిన ఆహారాన్ని అందజేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యార్థుల మధ్య సత్సంబంధాలు నెలకొల్పడంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ప్రధానోపాధ్యాయిని సత్యవేణి తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హ్యూమర్ క్లబ్ కార్యదర్శి మృతికి సంతాపం


నందూరి ప్రభాకర్(ఫైల్)

సీతంపేట: విశాఖ హ్యూమర్ క్లబ్ వ్యవస్థాపక కార్యదర్శి, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి నందూరి ప్రభాకర్ అనారోగ్యం కారణంగా ఆదివారం రాత్రి మృతిచెందారు. ఆయన అకాల మరణానికి చింతిస్తూ క్లబ్ సభ్యులు రావి గోపీకృష్ణ, ఎస్.ఎస్. రామానుజం, ఇ.భానుప్రకాష్, శ్రీపాద చిదంబరం, మేడా మస్తాన్‌రెడ్డి, వర్రే నాంచారయ్య, హేమ సంతాపం వ్యక్తం చేశారు. నగరంలోని పలు కామెడీ క్లబ్‌ల కళాకారులు సోమవారం తమ సంతాపం తెలిపారు.

ప్రణాళికా విభాగంపై ఆరా

విశాఖ సిటీ: మెట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్. విశ్వనాథన్ ప్రణాళికా విభాగం అధికారులతో సోమవారం సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఇందులో లేఅవుట్లు, భవన నిర్మాణ అనుమతుల మంజూరు వంటి అంశాలపై ఆరా తీశారు. అలాగే అనుమతుల విషయంలో పరిమితులు, విధి విధానాలను చీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ్‌రత్నకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ రవీంద్ర, ప్రణాళికాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

డ్రగ్స్ నిర్మూలనపై సమీక్ష నేడు

ఎంవీపీకాలనీ: మాదకద్రవ్యాల నిర్మూలన, రవాణా, కళాశాల విద్యార్థులపై ప్రభావం అంశంపై మంగళవారం జిల్లా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమీక్ష సమావేశం నిర్వహించనుంది. ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా కళాశాలలో మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ సమీక్ష జరగనున్నట్లు సంస్థ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొనున్నారు. డ్రగ్స్ నిర్మూలన, విద్యార్థులపై ప్రభావం పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై కమిషన్ చైర్మన్, సభ్యులు వీరికి దిశానిర్దేశం చేయనున్నారు. మంగళవారం ఉదయం కేజీహెచ్ డాక్టర్లు, హాస్పిటళ్ల యాజమాన్యాలతో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమీక్ష సమావేశం జరపనుంది.

శ్రీవారి ఆలయానికి వితరణ


ఏఈవోకు ప్యూరిఫైడ్ వాటర్ డిస్పెన్సర్లను అందజేస్తున్న కమిటీ సభ్యులు

ఎంవీపీకాలనీ: రుషికొండలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రానికి విశాఖ కార్తీక దీపోత్సవ కమిటీ రెండు ప్యూరిఫైడ్ వాటర్ డిస్పెన్సర్లు వితరణగా అందజేసింది. ఆలయ ఏఈవో జగన్మోనాచార్యులకు సోమవారం రుషికొండలోని ఆలయ ప్రాంగణంలో వీటిని అందించినట్లు కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. సౌత్ ఇండియా షాపింగ్‌మాల్, ఆర్ఎస్ బ్రదర్స్ యాజమాన్యం, కమిటీ సభ్యుడు ఆధ్వర్యంలో హాట్, కూల్ ప్యూరిఫైడ్ వాటర్ డిస్పెన్సర్లు అందజేసినట్లు పేర్కొంది. ఆలయానికి వచ్చే భక్తులు, అర్చకుల సౌకర్యార్థం వీటిని వితరణ చేశారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఆర్ఎస్ బ్రదర్స్ జీఎం నవీన్ దంపతులు, కమిటీ సభ్యుడు హిమాన్షు ప్రసాద్ పాల్గొన్నారు.

సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేష్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ మండల తహసీల్దార్‌గా సోమవారం ఎం.రమేష్ బాధ్యతలు చేపట్టారు. ముందుగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. 1996 బ్యాచ్‌కు చెందిన రమేష్ 1996–2012 వరకు ఉమ్మడి రాష్ట్రం హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో పనిచేశారు. 2012లో చినగదిలి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. అమరావతి సెక్రటేరియట్‌లోని వైద్య, ఆరోగ్య శాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేసి సీతమ్మధార మండల తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ విధులు సక్రమంగా నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లు పూర్తి చేయాలన్నారు. ప్రతి సర్టిఫికెట్ ఒరిజనల్ చూసి జారీ చేయాలని సూచించారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అందరూ విధులు నిర్వహించి ఇంటికి వెళ్లి పోవాలన్నారు. ఈ సందర్భంగా కొత్త తహసీల్దార్‌ను డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ కోరాడ రామలక్ష్మి, ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్వోలు, వీఆర్ఐలు, సచివాలయ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కలెక్టరేట్ ఏవోగా ఈశ్వరరావు


బాధ్యతలు స్వీకరిస్తున్న ఈశ్వరరావు

మహారాణిపేట: కలెక్టర్ కార్యాలయ ఏవోగా కె.వి. ఈశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్లిన ఆయన ఇటీవల తిరిగి వచ్చారు. గతంలో ఏవోగా పని చేసిన ఆయనను ఇప్పుడూ అదే పదవిలో నియమించారు. ఈశ్వరరావు గతంలో భీమిలి, సీతమ్మధార తదితర ప్రాంతాల్లో తహసీల్దార్‌గా పని చేశారు.

రక్త నిల్వల జాబితా ప్రదర్శించాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : రక్త నిల్వల జాబితా, వివరాలు ప్రతి బ్లడ్ బ్యాంకులో ప్రదర్శించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. జిల్లాస్థాయిలో ఉన్న బ్లడ్ బ్యాంకుల నిర్వాహకులతో సోమవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలో కనీసం రెండు రక్త దాన శిబిరాలు నిర్వహించాలని, అవసరమైన సమాచారాన్ని జిల్లా అధికారులకు ఇవ్వాలన్నారు. హెపటైటిస్–బి, సి పాజిటివ్ కేసులు, హెచ్ఐవీ, సిఫిలిస్ కేసుల వివరాలను వైద్య ఆరోగ్య శాఖకు పంపించాలని తెలిపారు. ముఖ్యంగా తలసేమియా కేసులకు ఉచితంగా రక్తం సరఫరా చేయాలని ఆదేశించారు. బ్లడ్ బ్యాంక్‌ల నిర్వహణకు లైసెన్స్, శిబిరాల నిర్వహణకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల కాలం కనుక తగిన స్థాయిలో ప్లేట్‌లెట్లను ప్రతి బ్లడ్ బ్యాంకులో నిల్వ ఉంచుకోవాలన్నారు. ఏ ఒక్కరికి బ్లడ్ లేదంటూ నిరాకరించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, కుష్ఠ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, సహాయ అధికారి ఉమామహేశ్వరరావు, సూపర్‌వైజర్లు బద్రి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ఊపిరి తీయొద్దు


దీక్షలో పాల్గొన్న పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు ఊపిరి తీయొద్దని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.బోసుబాబు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1264వ రోజు, సోమవారం కార్యక్రమంలో వారు మాట్లాడారు. మూడున్నర సంవత్సరాల నుంచి విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఆందోళన చేస్తుంటే రోజురోజుకూ ఉక్కును ఇరకాటంలో పెట్టడం, ఉత్పత్తికి విఘాతం కల్గించడం చేస్తుండడంతో కార్మికులు ఆందోళనలో ఉన్నారన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కును ప్రైవేటీకరించబోమని ప్రకటన చేయాలన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షిస్తామని రాష్ట్రంలో నాయకులు హామీ ఇచ్చారని, ఆ మేరకు ఉక్కు పరిరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస నాయుడు, దొమ్మేటి అప్పారావు, వరసాల శ్రీనివాసరావు, డేవిడ్, డి.శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

పోర్టు ఆస్పత్రిని పీపీపీకి ఇవ్వొద్దు


పోర్టు హాస్పిటల్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు ఆస్పత్రిని రూ.222.43 కోట్లతో పీపీపీ పద్ధతిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మార్చాలనే కేంద్ర మంత్రి ప్రతిపాదనను విరమించుకోవాలని, సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పోర్టు హాస్పిటల్ ఎదురుగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు హాస్పిటల్‌ను రూ.222.43 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు శుక్రవారం కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రకటించారని, ప్రస్తుతం కైలాసపురంలో 80 పడకల ఆస్పత్రిని పీపీపీ భాగస్వామ్యంతో 300 పడకల హాస్పిటల్‌గా మార్చాలని ప్రతిపాదన చేశారని వివరించారు. వెంటనే దీనిని విరమించుకోవాలన్నారు. ఈ హాస్పిటల్‌పై ఆధారపడి 4 వేల మంది ఉద్యోగులు, అధికారులు, 13 వేల మంది పెన్షనర్లు ఉన్నారని, దీనిని పీపీపీకి ఇస్తే వీరందరికీ వైద్యాన్ని దూరం చేస్తారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను వెంటనే ఆపాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి పోర్టు హాస్పిటల్‌ను కాపాడుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వి.ఎస్.పద్మనాభరాజు, సిటు నాయకులు బి.జగన్, బి.లక్ష్మణరావు, కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, నర్సింగరావు, ఈశ్వరరావు, లక్ష్మణ్, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రింక్‌లో స్కేటర్ల రయ్ రయ్



సాగరతీరంలోని బాంక్ రింక్‌లో ప్రాక్టీస్ చేస్తున్న చిన్నారి స్కేటర్లు

విశాఖ స్పోర్ట్స్: విశ్వక్రీడలు గ్రాండ్‌గా సాగుతున్న తరుణంలో విశాఖలో స్కేటర్లు ఉత్సాహంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. త్వరలో జరగనున్న నేషనల్స్ మీట్‌లో పాల్గొనేందుకు విశాఖ చిన్నారులు రింక్ రేస్‌ల్లో సత్తా చాటుతున్నారు. పారిస్ వేదికగా జరుగుతున్న ఒలింపిక్స్‌లో ఈసారి స్కేట్ బోర్డ్ పోటీలే ఉండగా.. ఆసియన్ గేమ్స్ స్కేటింగ్ పోటీల్లో విశాఖ స్కేటర్లు సత్తా చాటారు. సోమవారం సాగరతీరంలోని బాంక్ రింక్‌ల్లో చిన్నారులు కాళ్లకు స్కేట్స్ కట్టుకుని సర్రున దూసుకుపోతున్న దృశ్యాలు అబ్బురపరిచాయి. ప్రాక్టీస్‌లో భాగంగా ఇన్‌లైన్ స్పీడ్ రేస్‌లో ఉత్సాహంగా పోటీపడ్డారు.



– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మిడ్ డే మీల్‌పై పర్యవేక్షణ ఉండాలి

ఆరిలోవ: పాఠశాలలో మధ్యాహ్న భోజనం సమయంలో ఉపాధ్యాయులంతా పర్యవేక్షించాలని ఆర్జేడీ విజయ్‌భాస్కర్ తెలిపారు. డీఈవో ఎల్.చంద్రకళ, ఏపీసీ శ్రీనివాస్, ఎంఈవోలతో కలిసి ఆయన చినగదిలి మండలం పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆరిలోవ ప్రాంతం సెయింట్ ఆన్స్ పాఠశాలలో సోమవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆత్మ గౌరవం ఉంటుందన్నారు. దానికి అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని సూచించారు. విద్యార్థులకు అందించే కిట్స్, తరగతుల నిర్వహణ, మధ్యాహ్న భోజనం తదితర అంశాలు గురించి వివరించారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఉన్న స్లో లెర్నర్లను గుర్తించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో చినగదిలి ఎంఈవోలు సీహెచ్.రవీంద్రబాబు, పి.అనురాధ పాల్గొన్నారు.

అండర్–16 విజేత విశాఖ

విశాఖ స్పోర్ట్స్: అండర్ 16 మల్టీడే అంతర జిల్లాల మ్యాచ్‌ల ఫైనల్‌లో విశాఖ జట్టు 433 పరుగుల తేడాతో విజయం సాధించింది. నెల్లూరు వేదికగా మూడు రోజుల పాటు జరిగిన తుది పోరులో కృష్ణా జట్టుపై టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన విశాఖ జట్టు ఏడు వికెట్లకు 456 పరుగుల చేసింది. శ్రావన్ 113, రోహన్ 151 పరుగులతో సెంచరీలు నమోదు చేయగా ఈశ్వర్ 87 పరుగులు చేశాడు. కృష్ణా బౌలర్ సాయి సాత్విక్ మూడు వికెట్లు తీశాడు. ప్రతిగా కృష్ణా జట్టు 148 పరుగులకే ఆలౌటైంది. భానుస్వరూప్ ఆరు వికెట్లు తీయగా గౌతమ్ రెండు వికెట్లు తీశాడు.

ఆక్రమణలు తొలగించాలి

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్


ప్రజా మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశాలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్


ఫ్రూట్‌మార్కెట్ వద్ద చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

జగదాంబ: వీధుల్లో వ్యాపారులు ఆక్రమణలు వెంటనే తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన జీవీఎంసీ జోన్–4 పరిధి 35వ వార్డులో అధికారులతో కలిసి పర్యటించారు. దుర్గాలమ్మ గుడి నుంచి ఆయిల్‌మిల్లు సందురోడ్డు, ప్రసాద్‌గార్డెన్స్, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం రోడ్డు, రామకృష్ణా థియేటర్ జంక్షన్, జనతాకాలనీ, గాజులవీధి, పోలీసు బ్యారెక్స్, కల్లుపాకలు ప్రాంతాల్లో పర్యటించి కాలువలు, రహదారులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాపారులు వీధులు, రోడ్లను ఆక్రమించుకోవడంతో కాలువల్లో చెత్త పేరుకుపోతుందన్నారు. స్థానికులు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. హోల్‌సేల్ ఫ్రూట్‌మార్కెట్, వెదురు, స్క్రాప్ దుకాణాల ప్రాంతాల్లో అధికంగా ఉన్న వ్యర్థాలను గమనించిన ఆయన వెంటనే వాటిని తొలగించి పరిశుభ్రం చేయాలన్నారు. జనతాబజార్ వద్ద వ్యాపారులు రహదారిని ఆక్రమించుకోవడం గమనించిన ఆయన స్క్రాప్‌ను వెంటనే తొలగించాలన్నారు. నిబంధనలు పాటించని వ్యాపారులకు అపరాధ రుసుము విధించాలని జోనల్ కమిషనర్‌కు ఆదేశించారు. ప్రసాద్‌గార్డెన్స్‌లో ఉన్న ప్రజా మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని కేర్‌టేకర్‌ను ఆదేశించారు. జనతాబజార్ వద్ద నిర్మిస్తున్న అన్న క్యాంటీన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీరింగ్ అధికారి సత్యనారాయణరాజుకు ఆదేశించారు. ఈ పర్యటనలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం.దామోదర్, ఈఈ సంతోషికుమారి, ఏఎంహెచ్‌వో రాజేష్, ఏసీపీ ఝాన్సీలక్ష్మి, డీఈఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ యోజన పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన కరపత్రం, పోస్టర్‌ను కలెక్టర్ హరిందిర ప్రసాద్ ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ప్రత్యేక ఉప కలెక్టర్ టి.సీతారామ మూర్తి, రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, ఏపీఈపీడీసీఎల్ ఎస్.ఈ ఎల్.మహేంద్రనాథ్, జీవీఎంసీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

'శిష్ట కరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాలి'

అగనంపూడి: కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం శిష్ట కరణాలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు సహకారం అందించాలని శిష్ట కరణం అసోసియేషన్ కూర్మన్నపాలెం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ఎన్‌వి గోపాల్, డి.సత్యారావు కోరారు.

వడ్లపూడి కాలనీలో సోమవారం నిర్వహించిన కూర్మన్నపాలెం కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కలగజేసుకుని ఓబీసీ జాబితాలో చేర్చేందుకు సిఫార్సు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డి.గురునాథరావు, శేఖరమంత్రి శ్రీనివాసరావు, కె.రవినాథ్, ఎన్.నాగభూషణం, రాము, కిషోర్ కుమార్, గంగవరం గోపీ తదితరులు పాల్గొన్నారు.